క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుచ్చిరెడ్డిపాళెం మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఊటుకూరు రోడ్డు నుంచి పాతకొండూరుపాళెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను గురువారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని చెప్పారు. లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఎంపీపీ శ్రీనివాసులు, ప్రదీప్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని పారదోలుదాం

మనుబోలు: కుష్టు వ్యాధిని పూర్తిగా పారదోలుదామని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. మనుబోలులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని పిడూరులో నిర్వహిస్తున్న కుష్టు సర్వే తీరును పరిశీలించి వైద్య సిబ్బందిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీజీ వ్యాక్సిన్‌ను తప్పక వేయాలని సూచించారు. టీబీ కేసులను సర్వేలో నిర్ధారించాక క్రమం తప్పకుండా చికిత్సను అందించాలని కోరారు. సీహెచ్‌ఓ రాజయ్య, ఏఎన్‌ఎం నాగేంద్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెం గిరిజన కాలనీలో 50 కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీనివాసులు, సాయిమోహన్‌రెడ్డి మాట్లాడారు. తుఫాన్ బాధిత గిరిజనులకు ఏఆర్డీ సంస్థ తమ వంతు సాయం చేయడాన్ని అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు అంకయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ ఏడుకొండలు, పార్టీ నేతలు శ్యామ్ సుందర్‌రెడ్డి, విజయకుమార్, ఏఆర్డీ సంస్థ ప్రతినిధులు బషీర్, పావని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతకు పెద్దపీట

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో పని చేసే ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని పోర్టు సీఈఓ జీజే రావు పేర్కొన్నారు. పోర్టులో ద్విచక్రవాహనాలు కలిగిన వారికి హెల్మెట్లను సీఈఓ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. భద్రత ప్రమాణాలను ఉద్యోగులు తప్పక పాటించాలని కోరా రు. సీఓఓ సంజయ్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, సెక్యూరిటీ ఏజీఎం మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు గడువు పొడిగింపు

కోవూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల నమోదుకు గడువును జనవరి 12 వరకు పొడిగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నుడా వైస్ చైర్మన్, కోవూరు ఎన్నికల అధికారి బాపిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బీఎల్వోలతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని స్థానిక సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఓటర్ల నమోదు, డబుల్ ఎంట్రీలు, మృతులకు సంబంధించిన వివరాలను మరోసారి పూర్తిస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. తహసీల్దార్ పద్మజ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మధు, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ సుధ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం: వీఎస్‌యూ పరిశోధన విద్యార్థి వడేల మనోహర్‌బాబుకు డాక్టరేట్‌ను వీఎస్‌యూ ప్రదానం చేసింది. మాలెక్యూలర్ డిటెక్షన్ అండ్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ప్యాథోజెనిక్ బ్యాక్టీరియా ఇన్ స్మాల్ మామ్మల్స్ అనే అంశంపై బయోటెక్నాలజీ విభాగ అధ్యాపకుడు విజయానంద్‌కుమార్ బాబు పర్యవేక్షణలో పరిశోధన చేసి గ్రంథాన్ని వీఎస్‌యూకు సమర్పించారు. ఈ క్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశామని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి ప్రభాకర్ తెలిపారు.

దాణామృతం పంపిణీ

కోవూరు: కోవూరు పశుసంవర్ధక శాఖ సబ్ డివిజన్‌కు 10 మెట్రిక్ టన్నుల దాణామృతం వచ్చిందని, వీటిని రైతులకు పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి పేర్కొన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో గల పశు వైద్యశాల ప్రాంగణంలో రైతులకు దాణామృతాన్ని గురువారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పాడి రైతులు తమ ఆధార్ కార్డును తీసుకొచ్చి దాణామృతాన్ని ఉచితంగా పొందాలని కోరారు. కోవూరు సబ్ డివిజన్‌కు 9672 పశు కార్డులు మంజూరు కాగా, ఇప్పటివరకు 2436 కార్డులను రైతులకు పంపిణీ చేశామని వివరించారు. డాక్టర్ చంద్రమోహన్, ఏఏఎస్ నజ్జిద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో మెరుగైన వైద్యసేవలు

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమంచర్ల, సేవా జ్యోతి కాలనీ, అప్పయ్యకండ్రిగ ఎస్సీ కాలనీల్లో నూతన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు గురువారం అందజేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఎంపీ మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చని చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను సజావుగా అందిస్తున్నామని వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీని ఆదరించాలని కోరారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నేతలు వెంకటేశ్వర్లునాయుడు, సురేంద్రరెడ్డి, మద్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రూరల్ తహసీల్దార్ సోమ్లానాయక్, ఆర్‌ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పలువురు యువత చేరుతున్నారని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం క్లస్టర్ – 2 యూత్ అధ్యక్షుడు ఉడతా శ్రీనివాస కల్యాణ్ సారథ్యంలో ఆయన మిత్ర బృందం 150 మంది యువకులు ఎంపీ ఆదాల, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. పార్టీలో చేరిన యువతకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఆదాల

వ్యవసాయ కార్యాలయంలో ట్రెయినీ కలెక్టర్



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా గురువారం సందర్శించారు. ప్రభుత్వం నుంచి రైతులకు అందుతున్న వివిధ రకాల పథకాల వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలో ఎంత మేర సాగు చేస్తున్నారు.. ఏయే పంటలను ఎక్కువగా సాగు చేస్తుంటారనే వివరాలను ఆరాతీశారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు ఓట్లడిగే అర్హత లేదు



మాట్లాడుతున్న నిర్మల

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల అనంతరం నాలుగేళ్ల పాటు ప్రజలను పట్టించుకోని టీడీపీ నేత నారాయణకు ఓట్లడిగే అర్హత లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మల్లి నిర్మల పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై చర్చకు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆహ్వానిస్తే నారాయణ పత్తాలేకుండా పోయారని విమర్శించారు. వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్‌ను అనిల్ సాధించబోతున్నారని చెప్పారు. జూమ్ మీటింగ్‌ల పేరుతో టీడీపీ నేతలతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. టీడీపీని నెల్లూరు నగర ప్రజలు పాతికేళ్ల క్రితమే మర్చిపోయారని చెప్పారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



సండే మార్కెట్లో..



జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయంలో..

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని నెల్లూరు రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సండే మార్కెట్ క్యాలెండర్లను ప్రజాసైన్స్ వేదిక నేత మాల్యాద్రి గురువారం ఆవిష్కరించారు. సండే మార్కెట్ కమిటీ అధ్యక్షుడు హఫీజుద్దీన్, మాజీ కార్యదర్శి శరవణన్, ఏఐఎఫ్టీయూ నేత యానాదయ్య, మార్కెట్ కార్యదర్శి సెంథిల్‌కుమార్, కోశాధికారి ముత్తుమారి, సీనియర్ నేతలు రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా జలవనరుల శాఖ మెయింటెనెన్స్ ప్రాజెక్ట్ వర్కర్స్, వర్క్ చార్జ్ ఉద్యోగుల సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమోహన్ ఆవిష్కరించారు. రామలింగాపురంలోని జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ వాహన డ్రైవర్ల ప్రధాన కార్యదర్శి పాదిలి చిన్నయ్య, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మస్తానయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శి సలీమ్, వైస్ ప్రెసిడెంట్ చాన్‌బాషా, ఉపాధ్యక్షుడు రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని ఇందిరాభవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ నేత సీవీ శేషారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ లాంచర్



నెల్లూరు (టౌన్): అన్నమయ్య సర్కిల్లోని ఓవెల్ స్కూల్లో సైన్స్ లాంచర్ – 2ను గురువారం ఘనంగా నిర్వహించారు. సైన్స్ విజ్ఞానం – ప్రపంచంలోని ప్రతి ఒక్కరి క్షేమానికి పాటుపడాలి అనే అంశంతో సైన్స్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రైమరీ విభాగం నుంచి 169.. ఉన్నత పాఠశాల విభాగం నుంచి 240 నమూనాలను ప్రదర్శించారని ఓవెల్ సంస్థల సీఎండీ వేణు తెలిపారు. సీఈఓ ప్రమీల, జీఎం మహదేవన్, ఈడీ బాలు, డీజీఎం వహాబ్, ప్రధానోపాధ్యాయులు రఫీ, మీనాక్షి, ఏజీఎం హర్ష, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



నెల్లూరు (టౌన్): బ్రహ్మానందపురంలోని అవెన్యూస్ స్కూల్లో ఎన్‌సీసీ యూనిట్‌ను 10 ఆంధ్రా నావెల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో 50 మంది క్యాడెట్లకు అనుమతి ఉందని, ఈ విద్యా సంవత్సరంలో 35 మందిని ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు.
కరస్పాండెంట్ కృష్ణచైతన్య, ఎన్‌సీసీ యూనిట్ కేర్ టేకర్ వెంకటాద్రి, వైస్ ప్రిన్సిపల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీ

నెల్లూరు(మినీబైపాస్): ఆనం వెంకటరెడ్డినగర్, జగన్స్ కళాశాల సమీపంలోని వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం తనిఖీ చేశారు. సచివాలయాల్లోని ఇన్‌స్పెక్షన్ రిజిస్టర్, నోటీస్ బోర్డు తదితరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సేవలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా పోటీలను పర్యవేక్షించి క్రీడాకారులు, వీక్షకులకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని సూచించారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు – నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలి



వరి నాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: వరి సాగులో నీటి యాజమాన్య పద్ధతులు ఎంతో అవసరమని నెల్లూరు ఏడీఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. ములుమూడిలో వరినాట్లను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నీటి యాజమాన్య పద్ధతులను సక్రమంగా పాటిస్తే అధిక దిగుబడులను సాధించొచ్చని చెప్పారు. అనంతరం వరిసాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి

నెల్లూరు(బృందావనం): ఘంటసాల జయంత్యుత్సవాన్ని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సుబేదారుపేటలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ గాయకుడు సుందరరామిరెడ్డిని సత్కరించారు. రత్నమ్మ, లక్ష్మీదేవి, పద్మజ, సుజాత, లత తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లలో పరిశీలన

నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బీసీ హాస్టళ్లను బీజేపీ నేతలు గురువారం పరిశీలించారు. అక్కడి ఔషధ దుకాణాలను పర్యవేక్షించారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించిన 14 రకాల పరీక్షల ల్యాబ్‌ను పరిశీలించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్, రూరల్ కన్వీనర్ మండ్ల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు చేపట్టరూ..

నెల్లూరు రూరల్: పొదలకూరు మండలంలోని వరదాపురంలో అక్రమ మైనింగ్ జరుగుతున్నా, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడం విచారకరమని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్లో ఎస్సై స్వప్నకు ఫిర్యాదును గురువారం ఆయన అందజేశారు.

సంగీత విభావరి రేపు

నెల్లూరు(బృందావనం): సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు, అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకొని సుమధుర సినీ సంగీత విభావరిని పురమందిరంలో శనివారం నిర్వహించనున్నామని సృజన సాహితి, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కళాకారులు 78938 47709 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల విభాగ సిబ్బందితో సమావేశం



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(మినీబైపాస్): రాష్ట్ర తుది ఓటర్ల జాబితా – 2024 విడుదల తేదీని కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిందని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఎన్నికల విభాగ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను జనవరి ఐదున విడుదల చేయాల్సి ఉందని, దీన్ని 22న విడుదల చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని చెప్పారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువును జనవరి 12 వరకు పొడిగించారని తెలిపారు. తుది ఓటర్ల జాబితాను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈఆర్వోలు దేవీకుమారి, ధనుంజయరెడ్డి శ్రీనివాసులు, దశయ్య, నిర్మలా నందబాబా తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అయ్యప్పస్వామి నగరోత్సవం







నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో 41 రోజులుగా నిర్వహిస్తున్న మండల పూజలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా గురువారం నిర్వహించారు. నవాబుపేటలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి తరలివచ్చారు. శబరిమలవాసుడికి తంత్రులు పూజలను విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ముంగమూరు రాజేశ్వరమ్మ వ్యవహరించారు. అనంతరం మల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి అయ్యప్పస్వామి దేవస్థానం వరకు నగరోత్సవం వేడుకగా సాగింది. విశేష పుష్పాలంకారంలో తీర్చిదిద్దిన వాహనంపై అయ్యప్పస్వామి కొలువుదీరారు. అయ్యప్ప సేవా సమాజ నిర్వాహకులు శేషగిరిరావు, వెంకటరత్నం, రత్నయ్య, విజయకుమార్, శంకరన్ తదితరులు పర్యవేక్షించారు.

చిల్డ్రన్స్ పార్కులో పరిశీలన



నెల్లూరు(మినీబైపాస్): ఇటీవల సంభవించిన తుఫాన్ కారణంగా చిల్డ్రన్స్ పార్క్‌లో దెబ్బతిన్న ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలను వేగవంతంగా పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. చిల్డ్రన్స్ పార్కును గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్కులో పచ్చదనాన్ని పెంపొందించి, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. మరమ్మతులకు గురైన ఆట వస్తువులు, క్రీడా పరికరాల స్థానంలో నూతన పరికరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ సంపత్ కుమార్, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, సిటీ ప్లానర్ దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం.. ఆంధ్రా’



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆడుదాం.. ఆంధ్రా క్రీడోత్సవంలో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ పోటీలను గురువారం నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. డీఎస్డీఓ యతిరాజ్ తదితరులు పర్యవేక్షించారు.

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ మండలంలో ఆడుదాం.. ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. దేవరపాళెం సచివాలయానికి సంబంధించి సౌత్‌మోపూరు జెడ్పీ హైస్కూల్ మైదానం.. కందమూరు సచివాలయానికి సంబంధించి వెల్లంటి జెడ్పీ హైస్కూల్ మైదానంలో పోటీలను నిర్వహించారు. ఆడుదాం.. ఆంధ్రా రూరల్ మండల ప్రత్యేకాధికారి నాగరాజు, రూరల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరు(దర్గామిట్ట): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వీఆర్‌ఏలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో ఏఓ షఫీమాలిక్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనరసయ్య మాట్లాడారు. వీఆర్‌ఏలకు కనీస వేతనంగా రూ.26 వేలను ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, భాస్కర్, నేతలు చంద్రమౌళి, సుబ్బయ్య, బాషా, సీతమ్మ, సుమలత, సుందరయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న లాలేష్

నెల్లూరు సిటీ: నక్కలగుంటకు చెందిన రామ్మూర్తి (60) మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునేవారు వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ శర్వాణి కోరారు.

పోలూరి శతజయంత్యుత్సవ సమావేశం



ఉపన్యాసకులకు సత్కారం

నెల్లూరు(బృందావనం): ఆంధ్రా వాల్మీకి పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో సమావేశాన్ని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. విజయమహల్ గేట్ సమీపంలోని ఆంధ్రసభ గీతా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మబోధ.. రమణచరితామృత సారం .. బ్రహ్మశ్రీ హనుమజ్జానకీ రామశర్మ గ్రంథాలపై వెన్నెలకంటి సుబ్బరామయ్య, వేలమూరి సోమశేఖరం తదితరులు ఉపన్యసించారు. అనంతరం ఉపన్యాసకులను సత్కరించారు. ఇనమడుగు సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థస్వామి, సూరం శ్రీనివాసులు, పోలవరపు నరసింహరావు, ఆలూరు శిరోమణిశర్మ, నలుబోలు బలరామయ్యనాయుడు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.